క్లుప్తంగా

6న షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 6వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి స్త్రీ, పురుషుల విభాగంలో షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఈశ్వర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10వ నుంచి 13వ తేదీ వరకు విజయవాడలోని హనుమాన్ జంక్షన్‌లో నిర్వహించనున్న 41వ సీనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9989982655 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

క్యాన్సర్‌పై నేడు వాక్‌థాన్

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4వ తేదీన కర్నూలులో వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాక్‌థాన్(నడక) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ గ్రేటర్ కర్నూలు అధ్యక్షులు డాక్టర్ వాసురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నడక ఉదయం 7 గంటలకు కలెక్టరేట్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలని కోరారు.

5న ప్రగతి పొదుపు సంఘం సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రగతి మహిళ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఈ నెల 5న జరుగుతుందని జిల్లా సహకార అధికారి ఎన్.రామాంజనేయులు తెలిపారు. అడ్‌హాక్ బోర్డు ఎన్నిక నిమిత్తం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సీ.క్యాంపులోని శ్రీరామ్‌నగర్ ఎంహెచ్ అప్పా స్కూల్‌లో జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని, సంఘంలోని సభ్యులందరు హాజరు కావాలని సూచించారు.

ఓటర్ జాబితాలను రూపొందించండి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు సర్పంచు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 1న ప్రచురించిన ఓటరు జాబితా ఆధారంగా ఎలక్టోరల్ రోల్స్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నీలం సాహ్నీ ఉత్తర్వులు జారీ చేసినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో కౌతాళం మండలం బదినేహాల్ గ్రామ సర్పంచు పదవితో పాటు వివిధ మండలాల్లో 36 వార్డు మెంబర్ల స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే 7 మండలాల్లో 9 ఎంపీటీసీ స్థానాలు కూడా ఖాళీగా ఉన్నాయన్నారు. నంద్యాల జిల్లాకు సంబంధించి అవుకు మండలం అన్నవరం, ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు సర్పంచు స్థానాలతో పాటు 41 వార్డు మెంబర్ల స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే జూపాడుబంగ్లా, కొలిమిగుండ్ల మండలాల్లో 3 ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. త్వరలో ఈ సాధారణ ఖాళీలకు ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఓటరు జాబితాలను రూపొందించుకుని సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు.

రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలి

కర్నూలు(అర్బన్): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా నియమితులైన ఎన్‌సీహెచ్ బజారి రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోన నాగరాజు కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు బజారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వీఎం వెంకటేశ్వర్లు, కోశాధికారి ఆర్ సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసు

- బ్లీచింగ్ పౌడర్ దుర్వినియోగంపై కమిషనర్ ఆగ్రహం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

కర్నూలు (టౌన్): నగరపాలక శానిటేషన్ 8వ డివిజన్‌లో ఇటీవల నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పారిశుద్ధ్యం తనిఖీల్లో భాగంగా స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న నగరపాలక సంస్థకు చెందిన స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అందులో బ్లీచింగ్ పౌడర్ పెద్ద ఎత్తున వృథాగా పడి ఉంది. మున్సిపల్ కార్మికులకు సకాలంలో పంపిణీ చేయకపోవడంతో అదికాస్తా గడ్డ కట్టి పూర్తిగా దెబ్బతింది. రూ.లక్షలు విలువ చేసే బ్లీచింగ్ పౌడర్ విషయంలో స్పందించని స్టోర్ ఇన్‌చార్జ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌పై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే బ్లీచింగ్ పౌడర్‌ను దుర్వినియోగం చేయడంపై రూ.5 లక్షలు మీ వేతనంలో రికవరీ ఎందుకు చేయకూడదు అంటూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత వారం రోజుల క్రితం ఈ విషయం జరిగినా పారిశుద్ధ్య విభాగం నుంచి బయటకు పొక్కలేదు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విభాగంలో ఇష్టానుసారంగా అంతర్గత బదిలీలు, అవసరం లేకున్నా ఒత్తిళ్లతో మార్పులు చేర్పులు చేయడం, పారిశుద్ధ్యంపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంపై ప్రజల నుంచి బాహాటంగా విమర్శలు వస్తున్నాయి

జేబుకు చిల్లు... చైతన్యం నిల్లు

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎడాపెడా మోత!
- చలానాలు విధించినా వాహనదారుల్లో కానరాని మార్పు
- నెల రోజుల వ్యవధిలో రూ.72.88 లక్షల అపరాధ రుసుం
- చలానాలు చెల్లించకపోతే వాహనాలు సీజ్


పెండింగ్ చలానాలు వసూలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

కర్నూలు: నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలుపరాదు... హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడపరాదు. నంబర్ ప్లేట్ లేకుండా తిరగరాదు. పరిమితికి మించి కూర్చోరాదు. అతి వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ తగదు... ఇవన్నీ ట్రాఫిక్ నిబంధనలు. అన్నీ మన కోసమే. మన క్షేమం కోసమే. కానీ వీటిని పాటించకపోవడంతో ప్రమాదాల బారిన పడటంతో పాటు వాహనదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో ఒక కర్నూలు నగరంలోనే రూ.72.88 లక్షలు అపరాధ రుసుం చెల్లించారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి. చెల్లించినవారు వేలల్లో ఉంటే, చెల్లించాల్సిన వారు లక్షల్లో ఉంటున్నారు.

నిబంధనల అమలు పోలీస్ లక్ష్యం...

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నది పోలీసు శాఖ లక్ష్యం. అందులో భాగంగా 2019 నుంచి ట్రాఫిక్ ఈ–చలానాలు పకడ్బందీగా అమలు చేస్తుండగా కర్నూలు నగరంలో ట్రాఫిక్ పోలీసులు అదే స్థాయిలో జరిమానా విధిస్తున్నారు. ప్రతి కానిస్టేబుల్‌కు స్మార్ట్ ఫోన్ ఉండటంతో నిబంధనలు పాటించని ప్రతి వాహనదారుడికి చలానా విధిస్తున్నారు. వాహన యజమాని ఈ–మెయిల్, సెల్‌ఫోన్‌కు వచ్చే చలానా మెసేజ్‌లు పట్టించుకోకుంటే వాహనదారుడికి మరింత భారమయ్యే ప్రమాదముంది. చలానా విధించినట్లు తెలిసిన వెంటనే ఆన్‌లైన్‌లో కాని, మీ సేవలో కాని చెల్లిస్తే మంచిది.. లేదంటే అంతే సంగతి. ఒకటికి మూడు చలానాలు చెల్లించకపోతే వాహనాలు సీజ్ చేసే దిశగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

నిబంధనలు మనకోసమే...

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన బాధ్యత అందరిదీ. అందరూ సక్రమంగా సాగితే ఒక్క రోడ్డు ప్రమాదం కూడా జరగదు. నిబంధనల ఉల్లంఘన కారణంగా ఉమ్మడి జిల్లాలో నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్నో కుటుంబాల్లో అంతు లేని వేదన మిగులుతోంది. అధిక వేగం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం... ఇలా ప్రతి నిబంధనను తేలికగా తీసుకుంటుండటంతో కొన్ని సందర్భాల్లో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది.

జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్...

రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠినంగా వ్యవహరించాలన్న ఎస్పీ ఆదేశాల మేరకు నెల రోజులుగా నిరంతరాయంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జాతీయ రహదారులపై రాంగ్‌రూట్‌లో వెళ్లేవారిపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు నిర్వహిస్తూ రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా వారిలో చైతన్యం రావడం లేదు.

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఉల్లంఘనులపై చలానాలు ఇలా...

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన కేసులు	1,016
హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన కేసులు	7,721
వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్ల కేసులు	66
వన్‌వేలో రాంగ్‌రూట్ వెళ్లినవారిపై కేసులు	157
మొబైల్ మాట్లాడుతూ పట్టుబడిన వాహనదారులు	253
సిగ్నల్ జంపింగ్ కేసులు	7
రికార్డులు, పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన కేసులు	12,120
సీటు బెల్టు ధరించకుండా పట్టుబడిన కార్లు, జీపులు	552
అతివేగంతో వెళ్లిన వాహనాలపై కేసులు	2,618
ఓవర్‌లోడ్‌తో వెళ్లిన వాహనాలపై నమోదైన కేసులు	385
ట్రిపుల్ రైడింగ్‌తో పట్టుబడిన కేసులు	1,351
రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల కేసులు	1,290
రాంగ్ పార్కింగ్ చేసిన త్రీవీలర్, ఫోర్ వీలర్ కేసులు	701
నంబర్ ప్లేట్ లేకుండా సీజ్ చేసిన వాహనాల కేసులు	556
డ్రంకెన్ డ్రైవింగ్‌లో పట్టుబడిన కేసులు	52
నిబంధనలు ఉల్లంఘించి నెల రోజుల వ్యవధిలో వాహనదారులు చెల్లించిన అపరాధ రుసుం	రూ.72.88 లక్షలు

చలానాలు చెల్లించకపోతే చర్యలు



పెండింగ్‌లో ఉన్న చలానాలు వెంటనే చెల్లించాలి. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎక్కువ చలానాలు పెండింగ్‌లో ఉన్న వాహనాలు తనిఖీ అధికారులు పట్టుబడితే సీజ్ చేస్తారు. నిబంధనలు పాటించకపోవడంతోనే చలానాలు విధిస్తున్నారు. జరిమానాల కంటే వాహనదారుల్లో అవగాహన కల్పించడం ముఖ్యమని భావించి పోలీసు యంత్రాంగం రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం సమష్టిగా కృషి చేస్తోంది. ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యాన్ని చేరాలంటే ట్రాఫిక్ నియమాలు పాటించాలి.

– సిద్ధార్థ్ కౌశల్, ఎస్పీ

34 ఏళ్ల క్రితం కర్నూలుకు కళా తపస్వి

- సన్మానం అందుకున్న కే విశ్వనాథ్


విశ్వనాథ్‌కు జ్ఞాపిక ప్రదానం చేస్తున్న జె.లక్ష్మీనారాయణరెడ్డి(ఫైల్)


విశ్వనాథ్‌కు జ్ఞాపికను అందిస్తున్న క్లాసికల్ ఫిల్మ్ సొసైటీ గౌరవాధ్యక్షులు రవీంద్రనాథన్(ఫైల్)

కర్నూలు కల్చరల్: కళా తపస్వి కె.విశ్వనాథ్‌కు కర్నూలుతో ప్రత్యేక అనుబంధం ఉంది. కర్నూలు క్లాసికల్ ఫిల్మ్ సొసైటీ శాస్త్రీయ చిత్రాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 34 ఏళ్ల క్రితం తనవంతు కృషి చేసింది. సొసైటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని అప్పటి ఆనంద్, నట్రాజ్, సాయిబాబా, చాంద్, నౌరంగ్, అలంకార్, నేతాజి థియేటర్లలో శంకరాభరణం, స్వర్ణకమలం, శృతిలయాలు, సప్తపది, స్వాతిముత్యం, సాగర సంగమం సినిమాలను ఆరు రోజులు పాటు ఉచితంగా ప్రదర్శించారు. ఏడో రోజు అన్ని థియేటర్లలో శంకరాభరణం సినిమాను ప్రదర్శించారు. అదే రోజు 1989లో మార్చి 24న కె.విశ్వనాథ్ దంపతులతో పాటు అప్పుడు షూటింగ్ జరుపుకుంటున్న సూత్ర దారులు చిత్ర యూనిట్‌ను కర్నూలుకు ఆహ్వానించి నేతాజి థియేటర్‌లో ఘనంగా సన్మానించారు. హీరో హీరోయిన్లు భానుచందర్, రమ్యకృష్ణ, మురళీ మోహన్, సిరివెన్నెల సీతారామ శాస్త్రి తదితరులు హాజరయ్యారు. అప్పటి మంత్రి రాంభూపాల్ చౌదరి, పారిశ్రామిక వేత్త టీజీ వెంకటేష్, అప్పటి కలెక్టర్ సాహూ, సొసైటీ గౌరవాధ్యక్షులు రవీంద్రనాథన్‌లు ఘనంగా సన్మానించారు. కె.విశ్వనాథ్ కర్నూలు రావడం అదే మొదటిసారి, చివరి సారి. ఆయన మృతికి లక్ష్మీనారాయణరెడ్డి, పలువురు కళాకారులు పత్తి ఓబులయ్య, మీనాక్షిరెడ్డి, మహమ్మద్ మియ్యా, గుర్రపుసాల అంకయ్య, రమణారెడ్డి, లక్ష్మన్న, క్రిష్టఫర్‌లు సంతాపం ప్రకటించారు.

నర్సింగ్ స్కూళ్లకు నోటీసులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని పలు నర్సింగ్ స్కూళ్లకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో 12 నర్సింగ్ స్కూళ్ల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్ సంస్థలపై ఫీజులు, సర్టిఫికెట్లపై వచ్చే ఫిర్యాదుల గురించి సూచనలు చేస్తూ నోటీసులు ఇచ్చారు. నర్సింగ్ స్కూళ్లు వసూలు చేసే ఫీజుల వివరాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏఓ డాక్టర్ నాగప్రసాద్, సూపరింటెండెంట్ అరుణ, సీనియర్ అసిస్టెంట్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

దోమలు పెరగకుండా చూడాలి

కర్నూలు(హాస్పిటల్): నీటిలో దోమలు పెరగకుండా చూసుకోవాలని, ఈ మేరకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి, ఇంట్లోని పాత్రల్లో ఉన్న నీటిని వడబోసి, వాటిని ఆరబెట్టి, తిరిగి నీటిని పట్టుకుని వాడుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన నగరంలోని శ్రీరామనగర్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కాలనీలో ఇంటింటికి తిరిగి డ్రమ్ములు, కుండీలలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోవద్దని ప్రజలకు సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఖాళీ ప్రదేశాలు, డ్రైనేజీ నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు గుర్తించి, వాటిలో లార్వా వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డుల్లో తనిఖీలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి సెక్రటరీ గోవిందు, అసిస్టెంటు సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నగేష్ ఇతర సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. వాము, వేరుశనగ, మినుములు తదితర వ్యవసాయ ఉత్పత్తుల తూకాలను తనిఖీ చేశారు. రైతులకు ఈ–నామ్ తక్‌పట్టీలు ఇచ్చారా.. లేదా అనే దానిపై దృష్టి సారించారు. పలువురు రైతులకు కమీషన్ ఏజెంట్లు ఇచ్చిన తక్‌పట్టీలను పరిశీలించారు. ప్రతి రైతు కమీషన్ ఏజెంట్లను అడిగి ఈ–నామ్ తక్‌పట్టీలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు సూచించారు.

పారిశుద్ధ్యంపై మరింత పర్యవేక్షణ చేయాలి

కర్నూలు(టౌన్): నగరంలోని నాల్గవ శానిటేషన్ డివిజన్ మాసూం బాషా దర్గా, అలాగే 15వ డివిజన్ పరిధిలోని బళ్లారి చౌరస్తా ప్రాంతాల్లో నగరపాలక డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.రమాదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రావడంతో ఆయా కాలనీలు, వీధుల్లో డిప్యూటీ కమిషనర్ పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. పారిశుద్ధ్యంపై మరింత పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని హెచ్చరించారు. అదే కాలనీలో ప్లాస్టిక్ వాడుతున్న వ్యాపారులకు రూ.1500 జరిమానా విధించారు. అలాగే రూ.12 వేలు యూజర్ చార్జీలను వసూలు చేశారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ..పరిష్కారం చూపుతూ

- కల్లూరు అర్బన్‌లో 'గడపగడపకు మన ప్రభుత్వం'కు విశేష స్పందన
- ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే కాటసాని


మాదిరాజ్ నగర్‌లో సంక్షేమ పథకాల అమలుపై మహిళలతో ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనను వివరిస్తూనే ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్నారు. దీంతో కల్లూరు అర్బన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం 35వ వార్డు 91వ సచివాలయం పరిధిలోని మాదిరాజు నగర్‌లో స్థానిక కార్పొరేటర్ సాపురు మాధురి, వార్డు ఇన్‌చార్జ్ సాపురు వీరయ్య ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులందరం మీ గడపగడపకు వస్తున్నామని, ఏవైనా సమస్యలుంటే తమకు తెలియజేయాలన్నారు. అలాగే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాలను సకాలంలో అందిస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధిని నేరుగా అందజేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మీరెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతురెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్, నంద్యాల పార్లమెంట్ జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి ఎస్.శివ, నాయకులు బాలచంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, గోపీనాథ్, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పాడి గేదెలు మృతి

- ముగ్గిపోయిన కందుల దాణ తిని మృత్యువాత
- చావుబతుకుల్లో మరో నాలుగు

కర్నూలు(అగ్రికల్చర్): కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో నాలుగు ముర్రా జాతి పాడి పశువులు మృత్యువాత పడ్డాయి. గొల్ల జయన్న అనే రైతు పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఈయన శుక్రవారం పాతబడిన(ముగ్గిపోయిన) కందుల దాణను పశువులకు పెట్టాడు. వీటిని తిన్న గేదెలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. రెండు మూడు గంటల వ్యవధిలోనే రూ.3 లక్షల విలువ చేసే నాలుగు పాడి పశువులు మృత్యువాత పడ్డాయి. కల్లూరు ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పార్థసారథి, ఉలిందకొండ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ దీప్తి వెంటనే గ్రామానికి చేరుకుని పశువులకు వైద్యసేవలు అందించారు. అయినప్పటికీ పశువులు మృత్యువాత పడటం ఆందోళన కలిగించే విష యం. మిగిలిన నాలుగు పశువులను కాపాడేందుకు పశువైద్యులు కృషి చేస్తున్నారు. మృతిచెందిన పశు వులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతు జయన్న, రైతుసంఘాల నాయకులు కోరుతున్నారు.


కోలుకోలేక ఆటోడ్రైవర్ మృతి

కర్నూలు: మద్యం మత్తులో కింద పడి తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆటోడ్రైవర్ శ్రీరాములు(40) మృతిచెందాడు. ఈయన కల్లూరు ఎస్టేట్‌లో నివాసముంటాడు. గత నెల 31వ తేదీన అలంపూర్‌లో మద్యం సేవించి కర్నూలుకు వస్తూ పుల్లూరు టోల్‌ప్లాజా దగ్గర కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం ఉదయం మృతి చెందాడు. నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

1న వివిధ దేవతా మూర్తుల ప్రతిష్ఠాపన


శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరానికే తలమానికంగా రూపుదిద్దుకుంటున్న ఆధ్యాత్మిక స్ఫూర్తి కేంద్రం గోదా గోకులంలో శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన మహోత్సవం ఏర్పాటు చేసినట్లు గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, పల్లెర్ల నాగరాజు వెల్లడించారు. శుక్రవారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 1న దేశంలోని వివిధ సాధుసంతులు, జీయర్ స్వాములు, పీఠాధిపతుల సమక్షంలో ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు. విగ్రహ ప్రతిష్ఠకు ముందు ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ నుంచి గోదా గోకులానికి వివిధ కళారూపాలు సాంస్కృతిక కార్యక్రమాలతో శోభాయాత్ర ఉంటుందన్నారు. 20న అంకురార్పణ, 21న శ్రీ విశ్వక్సేన ఇష్టి, 22న శ్రీసుదర్శన ఇష్టి, 23న శ్రీహయగ్రీవ ఇష్టి, 24న శ్రీలక్ష్మీ నారాయణ ఇష్టి, 25న శ్రీనృసింహ ఇష్టి, 26న శ్రీవైభవేష్టి, 27న శ్రీవైనతేయ ఇష్టి, 28న శ్రీమన్నారాయణ ఇష్టి, మార్చి 1న మహాకుంభ సంప్రోక్షణం, ప్రాణ ప్రతిష్ఠా, దృష్టి కుంభం, నివేదన శాంతి కల్యాణం మొదలైన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు పోలాది సుబ్రహ్మణ్యం, రాంభూపాల్‌రెడ్డి, వేముల జనార్దన్, భూమా కృష్ణమోహన్, పెరుమాళ్ళ బాలకృష్ణ, ఇల్లూరు రామయ్య, వేముల రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నంద్యాల, కర్నూలు జిల్లాల ప్రజా రవాణ శాఖ అధికారులు

భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు

- ఆర్టీసీ ఈడీ గోపీనాథరెడ్డి


మాట్లాడుతున్న ఈడీ గోపినాథ్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): మహాశివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని ప్రజా రవాణ శాఖ(ఆర్టీసీ) కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ జోనల్ ట్రెనింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నడిపే ప్రతి బస్సు నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా శ్రీశైలానికి పంపే ప్రతి బస్సు ఫిట్ ఫర్ ఘాట్‌గా ధ్రువీకరించిన తరువాతే నడపాలని సూచించారు. నిష్ణాతులైన డ్రైవర్లకు మాత్రమే ఈ రూటులో బాధ్యతలు అప్పగించాలన్నారు. బస్సుల రాకపోకల సమయాల్లో రిపేర్లు వస్తే మరమ్మతుకు మొబైల్ మెకానికల్ టీమ్‌ను సిద్ధంగా ఉంచాలన్నారు. శ్రీశైలంతో పాటు మహానంది, బ్రహ్మగుండం, కాల్వబుగ్గ, జగన్నాథ గట్టు, గురజాల, యాగంటి, కొలనుభారతి, కొమ్ము చెరువు తదితర క్షేత్రాలకు తగిన సంఖ్యలో బస్సులు తిప్పనున్నట్లు తెలిపారు. సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజా రవాణ శాఖాధికారులు టి.వెంకటరామం, టి.శ్రీనివాసులు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు రజియా సుల్తానా, కర్నూలు, నంద్యాల, చిత్తూరు జిల్లా డిపో మేనేజర్లు, మెకానిల్ సిబ్బంది, సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

5న ఒలంపిక్ సంఘం ఎన్నికలు



కర్నూలు (టౌన్): ఈ నెల 5వ తేదీన నగరంలోని రాజ్‌విహార్ సెంటర్ సమీపంలో ఉన్న కేఈ ప్లాజా కాంప్లెక్స్‌లో ఒలంపిక్ సంఘం సర్వసభ్య సమావేశం, ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం చైర్మన్ కేఈ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు జిల్లాలోని 24 క్రీడాంశాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఒలంపిక్ అసోసియేషన్‌చే గుర్తింపు పొందిన స్విమ్మింగ్, బాక్సింగ్, జూడో, తైక్వాండో, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్, ఫెన్సింగ్, బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, రైఫిల్ షూటింగ్, ట్రయాథ్లాన్, మోడరన్ పెంటాథ్లాన్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, స్క్వాష్ రాకెట్, రగ్బీ, ఉషూ, యాచింగ్ వంటి క్రీడాంశాలు ఉన్నాయని తెలిపారు. గుర్తింపు పొందిన ఈ క్రీడలకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే జిల్లాలో మిగిలిన క్రీడాంశాలకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శులు కూడా సమావేశంలో పాల్గొని మద్దతు తెలియజేయాలని కోరారు. ఎన్నికైన సంఘం కార్యవర్గం, కార్యవర్గ సభ్యులు నాలుగేళ్ల పాటు కొనసాగుతారని తెలిపారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర ఒలంపిక్ సంఘం తరపున పరిశీలకులుగా వైఎస్సార్ జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు సమరనాథ్‌రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.

నేడు సంఘం సర్వసభ్య సమావేశం

ఈ నెల 4వ తేదీ జిల్లా ఒలంపిక్ సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహిస్తున్నామని, క్రీడా సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని జిల్లా సంఘం కార్యదర్శి రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. నూతన కార్యవర్గ ఎన్నికకు ఒలంపిక్ క్రీడాంశాల్లో పాల్గొనే అసోసియేషన్లకే ఓటింగ్ ఉంటుందని రాష్ట్ర ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.పి.రావు స్పష్టం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్చరీ, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రైఫిల్ షూటింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్, జూడో, రోయింగ్, జిమ్నాస్టిక్స్, రగ్బీ, స్కేటింగ్, సైక్లింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, ఫెన్సింగ్, కరాటే వంటి క్రీడాంశాలకు కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఓటింగ్‌లో పాల్గొనాలని తెలిపారు. ఈ ఒలంపిక్ సంఘం ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర సంఘం ప్రతినిధి మహేశ్వరరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు.